సంభాషణా చాతుర్యం - జీవన విజయానికి తొలి మెట్టు -- నారంశెట్టి ఉమామహేశ్వరరావు ,**9490799203**

పిల్లలూ! ఈనెల వ్యాసాన్ని ఒక ప్రముఖుడి జీవితంలో జరిగిన సంఘటనతో ప్రారంభిద్దాం.

బ్రహ్మశ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు చమత్కారం, హాస్యం, సమయస్ఫూర్తికి పెట్టింది పేరు. అంతే కాదు ఆయన ఆంగ్లభాషలో దిట్ట. బోధనలో గొప్ప నైపుణ్యం ఉన్నవారు. ఆయన బందరు నోబుల్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండగా జరిగిన సంఘటన ఇది .

ఒకసారి క్లాస్ అయిపోయాక నలభై కాంపోజిషన్ పుస్తకాలు తన చేతిలో పట్టుకుని వెళుతుండగా ఒక విద్యార్థి తెలిసో తెలియకో ఎదురుగా వచ్చి "మాష్టారు గారు గాడిద బరువు మోస్తున్నారే? ' అన్నాడు. ఆయనకు కోపం రాలేదు.

సమయస్ఫూర్తితో చమత్కారంగా వెంటనే "అవునురా ! ఒక గాడిద బరువు కాదు. నలభై గాడిదల బరువు మోస్తున్నాను" అని బదులిచ్చారట. ఆ పుస్తకాల్లో ఆ విద్యార్థి రాసిన కాంపోజిషన్ కూడా ఉండడంతో ఆ విద్యార్థి నోరు మూత పడిందట.

హాస్యం ఎంతటి వారినైనా లోబర్చుకుంటుంది. కోపం గల వారిని శాంతింప జేస్తుంది. కాబట్టి టీచర్స్ అప్పుడప్పుడు హాస్యం ప్రదర్శిస్తూ ఉండాలనేది ఇందులో ఒక కోణం కాగా ఆయన చూపిన సమయస్ఫూర్తి మరో కోణం .

పిల్లలూ! పై సంఘటన చదివాక మీకొక విషయం బోధపడి ఉండాలి. కోపం తెప్పించే విషయమే అయినా దాన్ని సమయస్ఫూర్తితో నవ్వించే జవాబుగా మార్చి మొత్తం వ్యవహారాన్ని సుతిమెత్తగా మారుస్తూ , అవతలి వారి నోరు మూతపడేలా చేయవచ్చు. అలా చెయ్యడం ఒక కళ. దానినే సంభాషణా చాతుర్యం అంటారు.

అందుకే సంభాషణా చాతుర్యం పెంచుకోవడమెంత అవసరమో ఈ నెల రాస్తున్న వ్యాసంలో చదువుకుందాం. వ్యాసంలో ప్రవేశించే ముందు వాక్కు గొప్పతనం తెలిపే ఒక పద్యం చదువుకుందాం.

భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్/
భూషిత కేశపాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్/
భూషలు గావు పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్రవాణి వా-/
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించు నన్నియున్

అంటారు భర్తృహరి . దాని భావమేమంటే మనుష్యులకు బంగారు భుజకీర్తులు (అంగదములు), ముత్యాల హారాలు (తారహారములు), చక్కగా అలంకరించుకున్న జుట్టు, సుగంధ జలాలతో స్నానం, పూలు ధరించడం వంటివి నిజమైన అలంకారాలు కావు. మనిషిని నిజంగా అలంకరించేది పవిత్రమైన మాట (వాక్కు). మాట అనే ఆభరణమే నిజమైన ఆభరణం. మిగిలిన ఆభరణాలన్నీ (బంగారు నగలు) ఎప్పటికైనా నశించిపోతాయి. అనగా ఇతర అలంకారాన్నీ కూడ తాత్కాలికమే. ఎప్పుడూ నశించకుండా ఉండే భూషణం వాగ్భూషణమేనని ఎంతో స్పష్టంగా చెప్పారు భర్తృహరి.

మాట విలువ ఎంత గొప్పదో తెలిసింది కదా . సరైన మాటను సరైన సమయంలో, ఎదుటివారిని గౌరవిస్తూ, స్పష్టంగా, మృదువుగా చెప్పగలగడమే సంభాషణా చాతుర్యం. కేవలం మాట్లాడడమే కాదు , వినడం, అర్థం చేసుకోవడం, స్పందించడం కూడా ఇందులో భాగమే.

మానవ జీవితంలో మాట్లాడటమనేది ఒక సాధారణ విషయం. కానీ ఎలా మాట్లాడాలి, ఎప్పుడు మాట్లాడాలి, ఎవరితో ఎలా చెప్పాలనే విషయాలు తెలుసుకుని మాట్లాడడాన్ని సంభాషణా చాతుర్యం అంటారు . ఇది ప్రతి ఒక్కరికీ అవసరమైన గొప్ప గుణం.

ఎదుటి వారితో మనం మాట్లాడే విధానం మన వ్యక్తిత్వాన్ని చెబుతుంది. కేవలం మాట్లాడటం వేరు, ఎదుటివారిని ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా చాతుర్యంతో మాట్లాడటం వేరు. దీనినే 'వాక్చాతుర్యం' అని కూడా అంటారు. పిల్లలైన మీకు ఇది చాలా ముఖ్యం.

అలా మాట్లాడటం తెలిస్తే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. భయం లేకుండా మాట్లాడగలిగితే స్టేజ్ మీద లేదా తరగతి గదిలో ధైర్యంగా ఉండవచ్చు. అందరితో మంచి స్నేహాలు ఏర్పడతాయి. మర్యాదగా, వివేకంతో మాట్లాడే పిల్లలకి స్నేహితులు కూడా ఎక్కువగా తయారవుతారు . అంతేకాదు లేనిపోని సమస్యలు రావు. ఉన్న సమస్యల్ని కూడ తొందరగా , ఇతరుల మనసు నొప్పించకుండా పరిష్కరించవచ్చు. అంతేకాదు ఎంతటి కష్టమైన విషయాన్నైనా గొడవలకు దారి తీయకుండా మంచి మాటలతోనే పరిష్కరించవచ్చు.

సంభాషణా చాతుర్యం వల్ల కలిగే ప్రయోజనాలు చాలానే ఉన్నాయి.

మొదటిది - నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయి. గొప్ప నాయకులందరూ మంచి వక్తలే. వారి మాటలతోనే ప్రజల మనసులను గెలుచుకో గలుగుతారు. మిగతా వారితో పోలిస్తే సంభాషణా చాతుర్యం ఉన్నవారు తొందరగా అందరితో కలిసిపోతూ కావలసిన పనులు చక్కదిద్దు కోగలుగుతారు.

రెండవది - జ్ఞాన సముపార్జన చేయవచ్చు. మంచి ప్రశ్నలు అడగడం, ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వినడం కూడా చాతుర్యమే. దీనివల్ల ఎక్కువ విషయాలు నేర్చుకోవచ్చు.

మూడవది - సంస్కారవంతంగా మాట్లాడేవారికి సమాజంలో ఎప్పుడూ తగిన గౌరవం ఉంటుంది. వారి మాట చెల్లుబాటు అవుతుంది.

నాలుగవది - ఆత్మవిశ్వాసం పెరుగుతుంది . ఏ విషయం పై అయినా , ఎంతమంది మధ్యలోనున్నా ధైర్యంగా మాట్లాడగలుగుతారు. అందరి మనసులను ఆకట్టుకునే సామర్థ్యం కలుగుతుంది.

ఐదవది - సంభాషణా చాతుర్యం ఉన్నవారిని స్నేహితులు, గురువులు ఇష్టపడతారు. అలాంటి వారి మాటలను వినడానికి కొత్త శ్రోతలు తయారవుతారు. వారి చుట్టుపక్కల ఉన్న వారు కూడా ఆకర్షితులవుతారు.

ఆరవది - నేర్పుగా సంభాషించడం వల్ల విద్యలో, ఉద్యోగంలో కూడ విజయం సాధించవచ్చు. అవసరమైన చోట అవసరమున్నంత మేరకు మాట్లాడి ఎదుటివారిని మెప్పించే చతురత ఉండడంవల్ల సానుకూల ఫలితాలు పొందగలుగుతారు.

సంభాషణా చాతుర్యం ఉంటే ఇంటా బయటా పనులెలా చక్కబెట్టుకోవచ్చో తెలిపే ఒక సరదా కథ చదువుదాం.

ముల్లా నసీరుద్దీన్ కథలు వినని వారు అరుదుగా ఉంటారు. అతని సంభాషణా చాతుర్యం గురించి తెలియని వారు అసలే ఉండరు . హాస్యంతో కూడిన సంభాషణలకు ముల్లా నసీరుద్దీన్ పెట్టింది పేరు.

ఒకసారి అతని చెప్పులు తెగిపోతే కొత్తవి కొందామని దుకాణానికి వెళ్లాడు. ఒక జత బాగా నచ్చింది. ధర ఎంతని దుకాణం యజమానిని అడిగాడు . “అందరికీ ఐదు దీనారాలకు అమ్ముతున్నాను. కానీ మీరు పెద్ద మనుషులు. కాబట్టి నాలుగు దీనారాలకు ఇస్తాను. తీసుకోండి” అన్నాడు దుకాణం యజమాని వినయంగా.

“ రెండు చేసుకోరాదు . పెద్ద మనిషినే కాదు కాస్త లోకజ్ఞానం తెలిసిన వాడిని కూడా” అన్నాడు నసీరుద్దీన్ . “మన్నించండి. నాలుగుకి తక్కువ ఇవ్వలేను. అలా చేస్తే నాకు నష్టం వస్తుంది. నష్టానికి ఎవ్వరు వ్యాపారం చేయరు కదా” అన్నాడు దుకాణం యజమాని.

అప్పుడు నసీరుద్దీన్” అయ్యో! ఇప్పుడెలా? పెద్ద చిక్కు వచ్చి పడింది. నా దగ్గర రెండు దీనారాలే ఉన్నాయి. ఓ పని చేద్దాం. రెండు దీనారాలు తీసుకొని ఒక చెప్పు ఇప్పుడు ఇవ్వు . మరో రెండు దీనారాలు తెచ్చాక మిగతా చెప్పు తీసుకుంటాను” అన్నాడు.

ఆ చమత్కారానికి నవ్వుకుంటూ రెండు దీనారాలు తీసుకొని “మిగిలిన రెండు దీనారాలు ఉన్నప్పుడే తెచ్చి ఇవ్వండి” అన్నాడు చెప్పుల జత ఇస్తూ దుకాణం యజమాని.

చూశారుగా... సంభాషణా చాతుర్యం ఉంటే పనులను ఎంత సులువుగా చక్కబెట్టుకోవచ్చునో నసీరుద్దీన్ మాటలే చెప్పాయి .

సంభాషణా చాతుర్యం తెలిపే ఉదాహరణలు అనేకం కనిపిస్తాయి. పురాణ కాలంలో సంభాషణా చాతుర్యం చూపి కార్యాలను చక్కబెట్టుకున్న వారు, విజయాలు సాధించిన వారు ఉన్నారు.

రామాయణ ఇతిహాసంలో ఒక సన్నివేశం చదువుదాం . శ్రీరాముని తరపున లంకలోకి రాయబారిగా వెళ్ళాడు అంగదుడు . అతడిని అవమానించాలని చూసాడు రావణుడు. అప్పుడు అంగదుడు తన వాలమునే (తోకను) చుట్టగా చుట్టి, రావణుడి సింహాసనం కంటే ఎత్తైన ఆసనాన్ని నిర్మించుకుని కూర్చుంటాడు. అది చూసిన రావణుడు "నువ్వు ఎవరు?" అని ప్రశ్నించగా, "నిన్ను ముప్పతిప్పలు పెట్టి దారుణంగా అవమానించిన వానర యోధుడు వాలి కుమారుడిని" అని సూటిగా, గంభీరంగా సమాధానమిచ్చి రావణుడి గర్వాన్ని అణచివేస్తాడు.

అంతకు ముందు రావణుడిని తన చంకలో పెట్టుకుని సప్త సముద్రాల్లో ముంచి తేల్చిన ఘనత వాలికి ఉంది. అది గుర్తు చేసాడు అంగదుడు. రాముని బలం తక్కువ కాదని చెబుతూ ఆయన పక్షాన తన లాంటి యోధులు చాలా మంది ఉన్నారని రావణుడికి గుర్తు చేసాడు . అది కదా సంభాషణా చాతుర్యం అంటే! శత్రువు సభలో కూడా భయం లేకుండా, తర్కంతో మాట్లాడటమే అంగదుడి చాతుర్యం.

మహాభారతంలో కూడ మరికొన్ని చెప్పుకోదగ్గ సన్నివేశాలు ఉన్నాయి . అలాంటి వాటిలో రెండు తెలుసుకుందాం.

కురుసభలో భీష్మ, ద్రోణులు వంటి మహామహులు ఉన్నప్పటికీ, ధృతరాష్ట్రుడికి ఏ కష్టం వచ్చినా విదురుడి సలహాను కోరేవాడు. విదురుడి మాట కటువుగా ఉన్నా సరే, నిజాన్ని చాలా యుక్తిగా చెప్పేవాడు.

సూదిమొన మోపినంత భూమి కూడా పాండవులకు ఇవ్వనని దుర్యోధనుడు భీష్మించుకుని కూర్చుండగా పాండవులకు జరుగుతున్న అన్యాయాన్ని చూడలేక, ధృతరాష్ట్రుడితో విదురుడు "రాజా! ఒక వ్యక్తి కోసం కుటుంబాన్ని, ఒక కుటుంబం కోసం గ్రామాన్ని, ఒక గ్రామం కోసం దేశాన్ని త్యాగం చేయవచ్చు.

ఆత్మ శ్రేయస్సు కోసం భూమినంతటినీ వదులుకోవచ్చు. అదే.... ఒక వ్యక్తి వల్ల కుటుంబం, వంశం, రాజ్యం నాశనం అవుతున్నప్పుడు ఆ వ్యక్తిని త్యజించాల్సి ఉంటుంది" అని హితబోధ చేశాడు. ఆ మాటల ప్రకారం దుర్యోధనుడిని త్యజించి అయినా పాండవులకు న్యాయం చెయ్యమన్న సూచన ఉంది.

రాజ్య క్షేమాన్ని ఆశించి విదురుడు చెప్పిన మాటల్లో చాతుర్యం కనబడుతుంది. కానీ పుత్ర వ్యామోహంతో దుర్యోధనుడు చేసిన చెడు పనులన్నీ సమర్థించాడు ధృతరాష్ట్రుడు . అందువల్లనే కురువంశం నాశనమైన సంగతి మనకు తెలిసిందే .

మరో చెప్పుకోదగ్గ సందర్భం యక్ష ప్రశ్నలు. ఈ ఘట్టంలో యక్షుడు అడిగిన ప్రశ్నలకు ధర్మరాజు చెప్పిన జవాబులు ఆయన తెలివిని, సమయస్ఫూర్తిని లోకానికి తెలుపుతాయి . పాండవులు అరణ్యవాసంలో ఉండగా యక్షుడు అడిగిన అత్యంత క్లిష్టమైన ప్రశ్నలకు ధర్మరాజు చాలా ఓపికగా, లోతైన అర్థం వచ్చేలా సమాధానాలు చెప్పాడు.

"లోకంలో అన్నిటికన్నా ఆశ్చర్యకరమైనది ఏది?" అని ప్రశ్నించినప్పుడు, "ప్రతిరోజూ జనం చనిపోతున్నా, మిగిలిన వారు తాము శాశ్వతంగా ఉంటామని అనుకోవడమే అతి పెద్ద ఆశ్చర్యం" అని సమాధానం ఇస్తారు ధర్మరాజు . ఇలాంటి తెలివైన జవాబులతో తన తమ్ముళ్ల ప్రాణాలు కాపాడుకున్నాడు ధర్మరాజు.

“మృదువైన మాటలు ప్రపంచాన్ని మార్చగలవు” అని మహాత్మా గాంధీ చెప్పినట్టు తమ మాటలతో భారతదేశం పట్ల విదేశీయులకు ఉన్న చులకన భావాన్ని మార్చిన ఘనత స్వామి వివేకానందకి దక్కుతుంది.

స్వామి వివేకానంద చికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభల్లో ప్రసంగిస్తూ కేవలం రెండు పదాలతో ప్రపంచాన్నే తన వైపు తిప్పుకున్నారు. ఆయన కంటే ముందు ప్రసంగించిన వారంతా సభికులను ఉద్దేశించి "లేడీస్ అండ్ జెంటిల్మెన్" అని సంబోధించగా ఆయన మాత్రం "అమెరికా దేశపు సోదరీ సోదరులారా!" అని సంబోధించారు. అంతే ! ఆ మాటలోని ఆత్మీయతకు సభలో ఉన్న వారంతా రెండు నిమిషాల పాటు లేచి నిలబడి కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేసారు. ఇది కదా సంభాషణా చాతుర్యానికి సరైన నిదర్శనం.

“మాటలతో మనసులను గెలుచుకోవడం గొప్ప నాయకత్వ లక్షణం” అని అటల్ బిహారీ వాజపేయి చెప్పిన మాటలు అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ గారికి సరిపోతాయి.

అమెరికా మాజీ అధ్యక్షుడు లింకన్ తన హాస్య చతురతతో, కథలతో ప్రత్యర్థులను ఆకట్టుకునేవారు. క్లిష్టమైన రాజకీయ సమస్యలను కూడా చిన్న కథల ద్వారా సామాన్యులకు అర్థమయ్యేలా చెప్పేవారు. సమస్యలు వచ్చినా అంతే చక్కగా పరిష్కరించేవారు.

ఒకసారి అబ్రహం లింకన్ అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు ఒక ప్రముఖుడు అతనిని అవమానించాలనుకున్నాడు. “ నేను వేసుకున్న బూట్లు మీ నాన్న కుట్టినవి. చాలాకాలం అయినప్పటికీ ఇంకా సౌకర్యవంతంగా ఉన్నాయి” అని కాళ్ల బూట్లు చూపించాడట. “నువ్వు చెప్పులు కొట్టుకునే వాడి కొడుకు “ అని గుర్తు చేసి అవమానించడం ఆయన ఉద్దేశం.

దానికి లింకన్ బాధపడకుండా “అలాగా .. ఎప్పుడైనా మీ బూట్లు పాడయిపోతే నాకు చెప్పండి. నేను సరి చేసి ఇస్తాను. మా నాన్నకి మాట రానివ్వను “ అని ఎంతో హుందాగా బదులిచ్చారట .

దాంతో ఆ ప్రముఖుడి ముఖం మాడిపోయిందట . అధ్యక్షుడిని ఇరకాటంలో పెట్టి ఆనందించాలనుకున్న ఆ ప్రముఖుడి ఉద్దేశం అలా నీరుగారిపోయింది.

"సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్" అని భర్తృహరి సుభాషితం చెబుతోంది. దాని భావం ఏమంటే "నిజం చెప్పాలి, కానీ మృదువుగా చెప్పాలి" అని . సరిగ్గా అలాగే ఉండేవి తెనాలి రామకృష్ణుడి మాటలు.

ఆయన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలుగా పిలవబడే కవుల్లో ఒకరు. ఆయన గురించి తెలియని వారుండరు. ఎంతటి ప్రమాదకరమైన పరిస్థితినైనా తన మాటలతోనే హాస్యంగా మార్చేసే నైపుణ్యం ఆయనది.

ఒకసారి నిండు సభలో శ్రీకృష్ణదేవరాయలు, తనకొక కల వచ్చిందని, అందులో అద్భుతమైన భవనాన్ని చూసానని, అచ్చం అలాంటి భవనాన్ని నిర్మించి ఇవ్వమని తన అధికారులకు చెప్పారు . ఆయన వర్ణించిన భవనం లాంటిది నిర్మించడం ఎవరి తరమూ కాదని మంత్రులు , ప్రముఖులు అనుకున్నారు . కానీ ఆ విషయాన్ని మహారాజుతో చెప్పే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

ఇలాంటి సందర్భాల్లో తన తెలివితేటలకు పదునుపెట్టే తెనాలి రామకృష్ణుడు చురుకుగా ఆలోచించాడు . రాయల వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

మరునాడు ఒక ముసలివాడి రూపంలో సభకి వచ్చి "మహారాజా! నా ధనం మొత్తం దోచుకుపోయారు. న్యాయం చెయ్యండి" అని చెప్పాడు.

కృష్ణదేవరాయలు "ఏమి జరిగిందో వివరంగా చెప్పు" అనగానే "రాత్రి మా ఇంట్లో ఉన్న బంగారం, డబ్బు , విలువైన వస్తువులు దోచుకోపోయారు. మీరే వాటిని కనిపెట్టి తిరిగి ఇప్పించాలి" అన్నాడు .

కృష్ణదేవరాయలు " ఎలా పోయిందో , ఎవరు దోచుకుపోయారో చెప్పు" అనగానే " ఇంకెవరు? దోచుకున్నది మీరే మహాప్రభూ.. మీ భటులతో వచ్చి సర్వం దోచుకుపోయారు" అని బదులిచ్చాడు.

శ్రీకృష్ణ దేవరాయల వారికి విపరీతమైన కోపం వచ్చింది. అయినా కోపాన్ని ఆపుకుంటూ " నీ సొత్తు దొంగిలించింది మేమా? మతి ఉండే మాట్లాడుతున్నావా ?" అని అడిగితే, "అవును ప్రభూ... రాత్రి వచ్చిన కలలో మీరే దోచుకెళ్లారు" అని చెప్పాడు ముసలివాడు .

చివరి మాట వినగానే శ్రీకృష్ణ దేవరాయల కోపం పోయింది. బిగ్గరగా నవ్వుతూ "నీ పిచ్చి కాకపోతే మరేంటి? కలలో వచ్చినవి ఎక్కడైనా నిజమవుతాయా? దానికే ఫిర్యాదు చెయ్యడానికి వచ్చావా ? పెద్దవాడివి కాబట్టి వదిలేస్తున్నాను. మరొకరైతే నా సమయం వృధా చేసినందుకు దండించేవాడిని" అన్నాడు.

దానికి ముసలివాడు "అంత మాట అనకండి ప్రభూ... మీ కలలో వచ్చిన భవనం లాంటిది కట్టించాలని మీరు అనుకోవచ్చు కానీ నేను మాత్రం నా కల విషయం చెబితే నేరం అవుతుందా?" అని అడిగాడు. దాంతో వచ్చింది తెనాలి రామకృష్ణుడు అని రాయలవారికి అర్థమైంది. ముసలివాడి రూపంలో వచ్చి తనకి బుద్ధి చెబుతున్నాడని గ్రహించాడు . కలలో కనిపించిన భవనం లాంటిది నిర్మించాలన్న సంగతి మరచిపోయాడు రాయలవారు.

అలా ఎన్నోసార్లు సందర్భోచితమైన తెలివితేటలతో రాజుకు కనువిప్పు కలిగించడం, సామాన్యులను రక్షించడం చేసాడు రామకృష్ణుడు.

బేతాళ విక్రమార్క కథలు ఎంత ప్రాచుర్యం పొందాయో అందరికీ తెలిసిందే. ఆ కథల్లో బేతాళుడు అడిగే చిక్కు ప్రశ్నలకు విక్రమార్కుడు ఇచ్చే తార్కికమైన సమాధానాలు ఆయన న్యాయ నిర్ణయానికి, మాట నేర్పుకు నిదర్శనంగా నిలుస్తాయి.

అలాగే బీర్బల్ - అక్బర్ కథల్లో కూడ సమయస్ఫూర్తి , సంభాషణా చాతుర్యం కనబడుతుంది . అక్బర్ అడిగే వింత ప్రశ్నలకు బీర్బల్ ఇచ్చే సమాధానాలు అద్భుతంగా ఉంటాయి. "ఢిల్లీలో ఎన్ని కాకులు ఉన్నాయి?" అని అక్బర్ అడిగితే, తడుముకోకుండా ఒక సంఖ్య చెప్పి, "తక్కువ ఉంటే చుట్టాల ఇంటికి వెళ్లాయని, ఎక్కువ ఉంటే చుట్టాలు వచ్చాయని అర్థం" అని చమత్కరిస్తాడు బీర్బల్ . ఇది కూడా సమయస్ఫూర్తితో కూడిన మాటకారితనం.

భారత స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే దేశంలోని సంస్థానాల విలీన విషయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవహరించిన తీరు, ఆనాటి రాజులతో , సంస్థానాధీశులతో మాట్లాడిన విధానం విలక్షణంగా ఉండేది. ప్రేమగా చెబుతూనే, అందులోని హెచ్చరికను (Iron Will) అర్థమయ్యేలా చేసేవారు. ఆయన సంభాషణా శైలి వల్లనే భారతదేశంలోని సంస్థానాలు విలీనమై మన దేశం ఒక్కటిగా నిలిచింది.

"మన మాటలు ప్రేరణగా మారాలి. అవి ఇతరులకు ఆశ నింపాలి" అని అబ్దుల్ కలాం గారు చెప్పిన మాటలు నేతాజీ సుభాష్ గారికి సరిపోతాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిది. "మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అనేవారు నేతాజీ సుభాష్ చంద్రబోస్. ఈ మాటలు కేవలం వాక్యం కాదు. ఒక సైన్యాన్ని తయారు చేసిన మంత్రం. వేల మైళ్ల దూరంలో ఉన్న భారతీయులను తన మాటలతో కదిలించి ఐ.ఎన్.ఏ (INA) స్థాపించిన ఘనత ఆయనది.

మరో ప్రముఖుడు భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి కూడా చెప్పుకోవాలి. ఆయన గొప్ప పండితుడు , రాజకీయవేత్త. విదేశాల్లో భారత ప్రతిష్ఠను తన మాటలతో పెంచారు.

ఒకసారి ఆయన విదేశీ పర్యటనలో ఉండగా ఒక తెల్ల జాతీయుడు "భారతీయులందరూ నల్లగా, రంగులు మారి ఉంటారు.. మా జాతి అంతా ఒకే రంగులో తెల్లగా అందంగా ఉంటుంది" అని ఎగతాళి చేశాడు.

దానికి రాధాకృష్ణన్ నవ్వి "దేవుడు రొట్టెలు చేస్తున్నప్పుడు మొదట చేసిన రొట్టె సరిగ్గా కాలక తెల్లగా వచ్చింది. అవి తెల్ల జాతులు. రెండోసారి చేసిన రొట్టె ఎక్కువ కాలడం వల్ల మాడిపోయింది అవి నల్ల జాతులు. మూడోసారి దేవుడు జాగ్రత్తగా కాల్చడంతో అది దోరగా, అందంగా వచ్చింది.. అవే భారతీయ జాతులు" అని జవాబు చెప్పారు. ఈ చమత్కారంతో ఆ విదేశీయుడు సిగ్గుతో తలదించుకున్నాడు.

రాజకీయాల్లో మాట్లాడటం ఒక కళ. అటల్ బిహారీ వాజ్ పేయి పార్లమెంటులో మాట్లాడుతుంటే విపక్షాలు సైతం నిశ్శబ్దంగా వినేవి. ఆయన తన ప్రసంగాల్లో కవిత్వాన్ని, హాస్యాన్ని జోడించి ప్రత్యర్థుల విమర్శలను చాలా సున్నితంగా తిప్పి కొట్టేవారు. 1996లో విశ్వాస తీర్మానం జరుగుతుండగా ప్రభుత్వం పడిపోయే సమయం వచ్చింది . అప్పుడు ఆయన పార్లమెంటులో ఇచ్చిన ప్రసంగం చరిత్రలో నిలిచిపోయింది.

" ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. పార్టీలు పుడతాయి, మునిగిపోతాయి. కానీ ఈ దేశం శాశ్వతంగా ఉండాలి" అని ఆయన గంభీరంగా అన్నప్పుడు సభలోని ప్రత్యర్థులు సైతం లేచి నిలబడి చప్పట్లు కొట్టారు.

ఓటమిలో కూడా హుందాతనాన్ని, గెలుపులో వినయాన్ని తన మాటల ద్వారా చూపించడం వాజ్ పేయి ప్రత్యేకత.

"మాటలలో శక్తి ఉంది.  అవి మనిషిని పైకి తీసుకెళ్లగలవు.  కిందకు దించగలవు" అని స్వామి వివేకానంద చెప్పేవారు. అందుకు సరిగ్గా సరిపోతుంది  ఇటీవల కాలంలో   సామాజిక  మాధ్యమాల్లో   విరివిగా ప్రచారమైన ఈ సంభాషణ.

ఇది  పరిపూర్ణానంద.. గోగినేని బాబుల  మధ్య  జరిగినట్లు చెప్పబడింది. అనగా ఒక నాస్తికునికి, ఆస్తికునికి మధ్య జరిగిన  సంభాషణ. ఇది చదివితే సంభాషణా  చాతుర్యం ఎలా ఉండాలో స్పష్టంగా  బోధ పడుతుంది.

ప్రశ్న: నేను జాతకాలు నమ్మను.

జవాబు --- అవును అది మీ జాతకంలోనే ఉంది.

ప్రశ్న: నేను దేవుడిని నమ్మను.

జవాబు ---- తప్పేముంది? రావణుడు, కంసుడు వంటివారు కూడా నమ్మలేదు.

ప్రశ్న: నాకు దేవుడిని చూపించగలరా?

జవాబు ---- ఆయన మిమ్మల్ని చూట్టానికి ఇష్టపడాలి కదా.

ప్రశ్న: ప్రసాదాలు సమర్పిస్తారు. మరి దేవుడు స్వీకరిస్తే ప్రసాదాల్లో ఒక్క మెతుకు కూడా తగ్గదేం?

జవాబు ----- మీరు పుస్తకం చదువుతారు. అందులో ఒక్క అక్షరమన్నా మాయం కాదేం.

ప్రశ్న: మనుషులను దేవుడే పుట్టిస్తే మరి అంతా సమానంగా లేరేం?

జవాబు ---- అదేంటి. అందరూ తొమ్మిదినెలలు గర్భంలో ఉండి నగ్నంగానే పుట్టి కెవ్వుమనే ఏడుస్తారుగా?

ప్రశ్న: దేవుళ్లకు, రాక్షసులకు పిల్లలున్నారుగా. మరి వాళ్ల పిల్లల పిల్లలు ఎవరూ లేరా?

జవాబు ----- ఉన్నారుగా. మనమంతా వారి వంశాలలోని వారిమేగా!

ప్రశ్న: దేవుడు సర్వశక్తి సర్వవ్యాపి కదా. మరి గుడిలో విగ్రహం ఎందుకు?

జవాబు ---- నీకు నిగ్రహం తక్కువ కదా. దాన్ని నిలపటానికి.

ప్రశ్న: దేవుడిని తలచుకోకపోతే జరగదా?

జవాబు --- ఏమో! నువే చెప్పాలి. క్షణం వదలకుండా తలచుకుంటున్నావుగా...

ఇలా సాగింది సంభాషణ  అది చదివితే తెలుస్తోందేమంటే మన జవాబు ఎదుటి  వారిని నొప్పించకుండానే మెప్పించగలగాలి. సుతిమెత్తని చురక అంటిస్తూనే  కాలిన విషయం తెలియకుండా జాగ్రత్త పడాలి. కొందరికి ఎలా చెబితే అర్థం చేసుకుంటారో వారికి అలాగే చెప్పాలి మరి .

పిల్లలు సంభాషణా చాతుర్యాన్ని అభివృద్ధి చేసుకోవడమెలా అనే  సందేహం కలగవచ్చు . అందుకు పిల్లలు  చేయాల్సిందల్లా అయిదు సూత్రాలు పాటించడం .

**1)** ప్రతిరోజు మంచి పుస్తకాలు చదవాలి. పుస్తక పఠనం మనోవికాసం పెంచుతూనే అనేక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. అందులో సంభాషణా  చాతుర్యం ఒకటి.  2) పెద్దల మాటలు శ్రద్ధగా వినాలి. పెద్దలు  మాట్లాడేటప్పుడు మనసు పెట్టి ఆలకించడం వల్ల సంభాషించే తీరు అలవడుతుంది. ఎలాంటి మాటలు మాట్లాడాలో  , ఎలాంటివి విడిచిపెట్టాలో  తెలుస్తుంది. క్రమేపీ స్వతహాగా ఆలోచించి మాట్లాడటం అవగతమౌతుంది. 3)  స్పష్టంగా మాట్లాడే అలవాటు చేసుకోవాలి. మాటల్లో స్పష్టత , ఆలోచనల్లో అవగాహనా ఉంటే చక్కని మాటలు అలవోకగా వెలువడతాయి. 4) అబద్ధం కాకుండా నిజం చెప్పాలి. ఎప్పుడైనా ఒక అబద్ధం చెబితే దానిని కప్పి పుచ్చడానికి మరికొన్ని అబద్ధాలు చెప్పాల్సి వస్తుంది. నిజాలే చెప్పేటప్పుడు తడబడాల్సిన పని ఉండదు.కాబట్టి సంభాషణలో తడబాటు లేకుండా మాట్లాడగలరు.   5) కోపంగా కాకుండా మృదువుగా మాట్లాడాలి. ఆవేశం అనర్థాలకు మూలం అవుతుందని అంటారు. కోపంలో  సరైన ఆలోచనలు కలగవు . కాబట్టి మృదువుగా మాట్లాడితే మనసులో శాంతంగా ఆలోచించడం వల్ల  మంచి భావాలు పుడతాయి.  వాటిని నోటి ద్వారా ఉచ్ఛరించగలిగితే మాటల చాతుర్యం పెరుగుతుంది.

ఈ అంశం మీద ఇంకెంత సేపైనా రాయవచ్చు. అంత గొప్ప అంశం ఇది. కానీ ముగింపు చేయాల్సిన అవసరం ఉంది కనుక చివరి వాక్యాలు రాసి వ్యాసాన్ని ముగిస్తాను.

ఈ సందర్భంలో మాటల ప్రయోగం గురించి సుమతీ శతక కర్త బద్దెన రాసిన  ఒక పద్యం చదువుదాం.

అధరము కదలియు, గదలక/

మధురములగు భాష లుడుగి మౌన వ్రతుడౌ/

అధికార రోగ పూరిత/

బధిరాంధక శవము జూడ బాపము సుమతీ! /

దాని భావమేమనగా ... ఓ బుద్ధిమంతుడా! అధికార దాహం వలన తన పెదవులని కదిపి కదపకుండా  మాట్లాడి,   మంచి మాటలు  మాట్లాడటానికి బదులు నిశ్శబ్దంగా ఉండే అధికారి, మూగ చెవిటి శవంతో సమానం. అటువంటి వారిని చూడటం కూడా ఒక పాపం.

ఇది చాలా కటువుగా చెప్పినట్టు,  అధికారులను నిందించినట్టు కనిపిస్తుంది.  కానీ సంస్కార హీనులై ఉన్నత పదవుల్లో ఉన్న వారు చాలా మంది ప్రవర్తించే రీతిని విమర్శిస్తూ వారలా ఉండకూడదని ఉపదేశిస్తున్నది.

దీనిని బట్టి అధికారులే కాదు సామాన్యులు కూడా ఎలా ఉండకూడదో బోధపడుతుంది . అనగా చక్కగా సంభాషించాలని , ఇతరులను మెప్పించాలని సూచిస్తోంది.

నిజానికి సంభాషణా చాతుర్యం ఒక గొప్ప సంపద. ఇది ఉంటే   జీవితంలో ఎక్కడైనా విజయం సాధించగలుగుతారు. చిన్నప్పటి నుంచే ఈ గుణాన్ని అభ్యసిస్తే భవిష్యత్తులో మంచి వ్యక్తులుగా, నాయకులుగా ఎదగగలరు .

“మంచి మాట మనిషిని గొప్పవాడిని చేస్తుంది” – కాబట్టి మనం కూడా మంచి మాటలు మాట్లాడడం నేర్చుకుందాం!.

పిల్లలూ ! మీరు కూడా సంభాషణా చాతుర్యం పెంచుకుని మీ జీవితంలో గొప్పవారు అవుతారు  కదూ.

——-----*****------

నారంశెట్టి ఉమామహేశ్వరరావు , పార్వతీపురం , ఫోన్ : 94907 99203

.